కథ

# భ్రాంతి

రాచపూటి రమేష్


"ఒరే చింటూ, పక్క సందులోని షాపుకెళ్లి ఓ సర్ఫ్‌పేకెట్ తీసుకొని రా" పదేళ్ల చింటు వురఫ్ గోపిని పురమాయించింది వాళ్లమ్మ నిర్మల.

"ఆ సందులో స్ట్రీట్‌లైట్ వెలగడం లేదమ్మా, అంతా చీకటిగా వుంది. నాకు భయంగా వుంది. నే వెళ్లను" కిటికీలోంచి ఆ సందులోకి తొంగి చూసి చెప్పాడు చింటూ.

అప్పుడే బేంకు నుండి ఇంటికొచ్చి, స్నానం ముగించి లాల్చీ, పైజామలోకి మారి పడక్కుర్చీల్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆశీష్ కొడుకు వంక ఓ సారి కోపంగా చూసి చెప్పాడు.

"ఒరే, నువ్వీ లేనిపోని భయాలన్నీ పోగొట్టుకోవాలి. లేకపోతే జీవితంలో పైకి రాలేవు".

చింటూ తండ్రి వంక ఆశ్చర్యంగా చూసి అడిగాడు. "ఐతే నువ్వు చిన్నప్పుడు ఒక్కసారి కూడా భయపడలేదా డాడీ?"



"లేదురా, మేం చిన్నప్పుడు హైస్కూల్లో చదువుకోవాలంటే మా విలేజ్ నుంచి మూడు మైళ్లు నడిచి పక్కనుండే టౌన్‌కి వెళ్లాల్సి వచ్చేది. స్కూలు, ట్యూషన్ ముగించుకొని ఇంటికి బయల్దేరే సమయానికి చీకటి పడేది. మా వూరికి వెళ్లేదారిలో వూడలు దిగిన ఓ పెద్ద మర్రి చెట్టుండేది. అందరూ దాన్ని దెయ్యాలమర్రి అనేవాళ్లు. ఒక్కోసారి నేనొక్కణ్ణే రాత్రి తొమ్మిది, పదికి కూడా ఆ మర్రి చెట్టు దాటుకొని ఇంటికెళ్లే వాణ్ణి. అక్కడికి చేరగానే కొన్నిసార్లు ఏవో భయంకరమైన శబ్దాలు వినిపించేవి. ఐనా ఒక్కసారి కూడా నేను భయపడలేదు" గర్వంగా చెప్పాడు ఆశీష్.

ఆశీష్ జీవితంలోనే అత్యంత భయంకరమైన రోజు అతి సమీపంలోనే పొంచి వుందని అతనికా సమయంలో తెలియదు.

***

"పోలీసులకు కబురు పెట్టండి" తీరిగ్గా కూర్చుని వక్కపొడి నములుతూ అన్నాడు గుర్నాధం.

"అవసరం లేదు. పోలీసులంటే అఫిషియల్ కంప్లెయింటు ఇవ్వాలి. మన రికార్డ్స్‌లో రిజిస్టర్ చెయ్యాలి. ఆశీష్ సర్వీస్ రిజిస్టర్లో ఎంటరౌతుంది! తరువాత అతనికి త్వరలో రాబోయే ప్రమోషన్ ఆగి

పోవచ్చు'' కంగారుగా చెప్పాడు బేంకు మేనేజర్ రవీంద్ర.

''అసలు కాష్ సీట్లో ఎప్పుడూ చాలాజాగ్రత్తగా వుండే ఆశీష్ ఎందుకింత దారుణమైన పొరపాటు చేశాడో అర్థం కావడం లేదు. ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి అకేషన్‌రాలేదు'' ఆశీష్‌ను ఓదారుస్తున్నట్లు అన్నాడు ముజీబ్.

ఆశీష్ తన సీట్లో విచారంగా కూర్చుని వున్నాడు.

''మనలాంటి వాళ్లు మెత్తగా అడిగితే చేసిన నేరాన్ని ఎవరైనా అంత సులభంగా ఒప్పుకుంటారా? పోలీసులు డీల్ చేస్తే ఫలితం వేరుగా వుంటుంది'' సిగిరెట్ వెలిగిస్తూ చెప్పాడు గుర్నాధం.

ఆశీష్ మనసు మొద్దుబారినట్లైంది. ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కింది.

తాను కేషియర్ సీట్లో కూర్చుని ఎన్నోరోజులు పని చేశాడు. ఎప్పుడూ ఎలాంటి పొరబాటు జరగలేదు. కానీ ఈ వేళ ఎందుకో.... ఆ రోజు ఉదయం జరిగిన సంఘటన అతని మనసులో మెదిలింది.

ఆశీష్ ఎప్పటిలాగే అప్రమత్తంగా కేషియర్ సీట్లో పని చేస్తూవున్నాడు. ఉదయం పన్నెండు గంట లకు, రద్దీ ఎక్కువ వున్న సమయంలో ఓ సఫారీ సూట్‌వాలా డబ్బులు విత్ డ్రా చేయడానికి వచ్చాడు. అతడి నిదివరకూ చూసినట్లు ఆశీష్‌కు గుర్తు లేదు. బహుశా కొత్త కస్టమర్ కాబోలు.. అనుకున్నాడు ఆశీష్, ఆ పిల్లి గడ్డం వ్యక్తి గురించి.

ఆ వ్యక్తి తన పాస్‌బుక్‌తో బాటు విత్‌డ్రాయల్ స్లిప్ ఆశీష్‌కు అందించి, స్నేహ పూర్వకంగా ఓసారి నవ్వాడు. క్షణకాలం పాటు అతని కళ్లల్లో ఏదో సమ్మోహన శక్తి వున్నట్లు అనిపించింది ఆశీష్‌కు. కౌంటింగ్ మెషిన్లో నోట్ల కట్ట లెక్కబెట్టి ఇచ్చాడతనికి. ఆ వ్యక్తి డబ్బు లెక్క బెట్టుకొని వెళ్లిపోయాడు.

సాయంత్రం కౌంటర్ మూసివేసిన తరువాత అక్కౌంటు టాలీ చేయాలని చూస్తే ఎంతకూ టాలీ కావడం లేదు అశీష్‌కు. నగదు యాభై వేల రూపాయలు తక్కువ వస్తోంది. ఎన్నిసార్లు చెకప్ చేసినా అదే మొత్తం తేడా రావడంతో ఆశీష్‌కు తారెత్తినట్లైంది. మేనేజరు దృష్టికి తీసుకు వెళ్లాడా విషయాన్ని. ఐదు నిమిషాల్లో ఆ వార్త బ్యాంకు సిబ్బంది మొత్తానికీ తెలిసింది.

అదృష్టవశాత్తూ బ్యాంకులో కౌంటర్ల సమీపంలో సెక్యూరిటీకోసం జామ్ కెమెరా ఏర్పాటు చేయ డం జరిగింది. అందులో శ్రద్ధగా పరిశీలిస్తే ఓ కస్టమర్‌కు ఐదువందల రూపాయల నోట్ల కట్ట బదులు వెయ్యి రూపాయల నోట్ల కట్ల తానందచేసినట్లు గుర్తించాడు ఆశీష్. కెమెరా కంట్లో ఆ కస్టమర్ కూడా చిక్కాడు. అతను మరెవరో కాదు. ఆ సఫారీ సూట్‌లో వున్న పెద్ద మనిషే.

ఆ కస్టమర్ అక్కౌంటు నెంబరు బట్టి కంప్యూటర్లో అతని చిరునామా పట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు. ఊరికి దూరంగా వున్న తాటి తోపు సమీపంలో వుంది ఆ సఫారీ సూట్‌వాలా ఇల్లు.

'పదిహేనేళ్ల తన సర్వీస్‌లో తానెప్పుడూ ఇంత పెద్ద తప్పు చేయలేదు. ఎలాగైనా ఈ గండం నుండి గట్టెక్కితే బాగుంటుంది' అని చింతించసాగాడు ఆశీష్.

అప్పటికే రాత్రి ఎనిమిది గంటలు కావస్తుండడంతో మరుసటిదినం పోలీస్ కంప్లెయింట్ ఇవ్వమని సలహా ఇచ్చి మిగిలిన బ్యాంకు సిబ్బంది ఎవరి దారిన వారు వెళ్లారు. 'సమస్య వారిది కాదు కదా' అనుకున్నాడు ఆశీష్.

'తాను ఇంటికి ఆలస్యంగా వస్తున్నట్టు భార్య నిర్మలకు ఫోన్‌చేసి చెప్పాడు' ఆశీష్. ముందుగా బ్యాంకుకు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పోలీసు స్టేషన్‌కి వెళ్లాడు.

ఆ సరికి స్టేషన్‌లో ఎస్సై లేడు. ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు తీరిగ్గా పేపరు చదువుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.


'సి.ఐ., ఎస్సై సి.ఎం., పర్యటనకు ఏర్పాట్లు చేయడానికి వెళ్లారు. మరో గంట ఆగితే హెడ్ కానిస్టేబుల్ వస్తాడు. అన్నారు వారు ఆశీష్ చెప్పిందంతా విని.

ఆశీష్ హతాసుడయ్యాడు. ఆలస్యం చేస్తే కస్టమరు డబ్బును ఖర్చు చేసేయవచ్చు. లేదూ మరో ప్రదేశంలో దాచేయవచ్చు. కొత్త నోట్ల బండిల్ కాబట్టి నోటు నంబర్లు ఆశీష్ దగ్గరే వున్నాయి. 'త్వరగా వెళ్తే ఆ సొమ్మును స్వాధీనం చేసుకోవచ్చు. బతిమాలో, బెదిరించో 'భూపతి' అనే ఆ కస్టమరు నుండి ఆ అమౌంట్ రాబట్టవచ్చు' అనుకున్నాడు.

తన బైక్‌పై వేగంగా ప్రయాణించి తాటితోపు సమీపంలోకి చేరుకున్నాడు ఆశీష్. ఆ ప్రాంతం నిర్మానుష్యంగా వుంది. ఇళ్లు కూడా పెద్దగాలేవు. దాదాపు పావు గంట పాటు ఆ ప్రాంతంలో గాలించి భూపతి వున్న ఇల్లు కనుక్కొనాడు.

ఆ ఇంటి దరిదాపులో ఇళ్లేమీ లేవు. విశాలమైన కాంపౌండ్లో చుట్టూ చెట్లతో ఎత్తైన గోడలతో వుందా బిల్డింగ్. ఆ ఇంటి ముందు మనుష్య సంచారమేదీ లేదు. సన్నగా వర్షం ప్రారంభమయ్యింది.

తన బైక్ ఇంటి ముందు పార్క్‌చేసి చెక్కగేటు తీసుకొని ఆ కాంపౌండ్లోకి అడుగు పెట్టాడు ఆశీష్. తెలియని భయమేదో అతన్ని క్షణకాలం పాటు ఆవరించింది. తన వెంట ఎవరినైనా తోడు తీసుకొని వచ్చి వుంటే బావుండేదనిపించిందతనికి.



చిరుజల్లు జడివానగా మారుతోంది. దూరంగా ఎక్కడో వురిమింది. మెరుపు వెలుతురు ఇంటి సమీపంలో వున్న పెద్ద మర్రిచెట్టుపై క్షణకాలంపాటు పడి ఆశీష్‌ను క్షణకాలం పాటు భయ భ్రాంతుణ్ణి చేసింది.

పాతకాలపు ఇల్లు. ఇంటి తలుపులు, కిటికీలు నల్ల రంగుతో వుండడం అతన్ని విస్మయపరిచింది. కాలింగ్ బెల్ నొక్కబోయి ఆగిపోయాడు ఆశీష్. ఇంట్లో కరెంటు లేనట్లుంది. లోపలంతా నిశ్శబ్దంగా వుంది. క్షణకాలం పాటు గాఢంగా వూపిరి పీల్చుకొని తలుపును చిన్నగా తోశాడు. కిర్రుమన్న శబ్దంతో తలుపు తెరుచుకొంది.

చీకటిని చీలుస్తూ ఇంట్లో రెండు కొవ్వొత్తులు వెలుగుతూ వున్నాయి. ఒక మూలగా వున్న పాత కొయ్య కుర్చీలో కూర్చుని వున్న ఆకారాన్ని చూసి ఆశీష్ తన నోటి నుండి వెలువడబోయిన కేకను బలవంతంగా ఆపుకున్నాడు.

తెల్లటి చీర, జాకెట్ ధరించి వున్న ఓ స్త్రీ జుట్టు విరబోసుకొని ఆ కుర్చీలో కూర్చుని వుంది. ఆశీష్‌ను చూసినా ఆమె ముఖ కవళికల్లో ఎలాంటి మార్పు లేదు.

''రా ఆశీష్, నువ్వొస్తావని నాకు తెలుసు'' అన్న మాటలు వినబడడంతో ఆశీష్ వులిక్కిపడి పక్కకు చూశాడు. నల్లటి దుస్తులు, కోరమీసాలు, పిల్లిగడ్డంతో వున్న ఓ బలాఢ్యుడు మరో చెక్క కుర్చీలో ఆసీనుడై వున్నాడు. అతని పక్కనే స్టూల్‌పైన కూర్చుని వున్న ఓ నల్లటి పిల్లి వంక ఆశీష్ ఆశ్చర్యంగా చూశాడు.

''మీరెవరు? నేనిక్కడికి వస్తానని మీకెలాతెలుసు?'' తడబడుతూ ప్రశ్నించాడు ఆశీష్. వుదయం తాను బ్యాంకులో చూసింది ఇతనినే' అని గుర్తుంది ఆశీష్‌కి.

''అలా కూర్చో, మాట్లాడుకుందాం'' ఆశీష్ వంక తీక్షణంగా చూసి మరో కుర్చీని చూపిస్తూ అన్నాడా ఆజానుబాహుడు. టీపాయ్ వెనకున్న చెక్కకుర్చీలో ఆశీష్ భయపడుతూ కూర్చుని చుట్టూ ఓసారి చూశాడు. ఆ హాలు నిండా పాతకాలపు ఫర్నిచర్, మూలగా ఓ పాతకాలపు గ్రామ ఫోను వున్నాయి. గోడల నిండా ఏవో పెయింటింగ్స్ తగిలించి వున్నాయి. టీపాయ్ మీద కపాలం ఆకారంలో వున్న యాష్ ట్రే అతన్ని విస్మయపరచింది.

''కొద్దిగా జూస్ తాగుతావా, అలసి పోయినట్లున్నావు'' చింత నిప్పుల్లాంటి కళ్లతో ఆశీష్‌ను చూస్తూ ప్రశ్నించాడా వ్యక్తి. ఆశీష్ భయపడుతూ తల వూపాడు. వెంటనే జరిగిన సంఘటన ఆశీష్‌ను భయ భ్రాంతుణ్ణి చేసింది.

ఆ నల్లటి వ్యక్తి చేయిచాపగానే, అది అమాంతం పెరిగిపోయి, షోకేసు అద్దాలు జరిపి అందులోని గాజు గ్లాసును బయటకు తీసింది. సీసాలోని ద్రవాన్ని గ్లాసులోకి వంపి ఆ బలాఢ్యుడు మళ్లీ చేయి చాపి ఆ గ్లాసును ఆశీష్ ముందున్న టీపాయ్‌పై వుంచాడు.

''లెమన్ జూస్ తీసుకో'' గరగరమన్న గొంతుతో అన్నాడతను.

''వద్దు... వద్దు .... లెండి'' తడారిపోతున్న గొంతులో వణుకుతూ అన్నాడు ఆశీష్.

''ఏం లెమన్ జూస్ ఇష్టం లేదా, పోనీ ఆపిల్ జూస్ తాగు'' గంభీరంగా అన్నాడు ధృడకాయుడు. వెంటనే ఆశీష్ ముందున్న టీపాయ్‌పై గ్లాజు గ్లాసులో వున్న ద్రవం రంగు ఎర్రగా మారింది.

వణుకుతున్న చేత్తో గ్లాసు అందుకొని తీసుకుంటూ పొరబాటుగా జారవిడిచాడు ఆశీష్. అతని చేతిలోని గ్లాసు కిందబడగానే, నల్లపిల్లి హఠాత్తుగా నేల మీదకు దూకి గుజ్జులా వున్న ఆ ద్రవాన్ని శుభ్రంగా నాకేసింది.

భయంతో కెవ్వున కేక వేశాడు ఆశీష్. ఆ దృశ్యాన్ని చూసి తెల్లటి చీరలోని స్త్రీ పకపకా నవ్వింది. ఆ నువ్వు ఆశీష్‌ను హడలెత్తిచ్చింది.

దూరంగా ఎక్కడో మెరిసింది. కిటికీ తలుపులు గాలికి టపాటపా కొట్టుకొంటున్నాయి. ''తలుపులు మూయమని ఎన్నిసార్లు చెప్పాలి'' అంటూ ఆ వ్యక్తి గట్టిగా చప్పట్లు తట్టాడు. వెంటనే కిటికీ తలుపులు మూసుకున్నాయి. కానీ ఆసరికే గాలి లోనికి ప్రవేశించి కొవ్వొత్తులని ఆర్పి వేసింది. గోడ మీదనున్న చిత్రపటమేదో దభీమని శబ్దం చేస్తూ కింద పడింది.

గదిలో చిమ్మచీకటి ఆవరించింది. ఆశీష్ చిన్నగా పైకి లేచాడు. 'మెల్లగా ఈ ఇంటి నుండి జారు కునేది మంచిది. తెలియకుండా ఈ బూత్ బంగళాలోకి ప్రవేశించాను. ప్రాణాలు దక్కుతాయే లేదో' అనుకున్నాడు భయంగా.

> ''ఏం లెమన్ జూస్ ఇష్టం లేదా,
> పోనీ ఆపిల్ జూస్ తాగు''
> గంభీరంగా అన్నాడు ధృడకాయుడు.
> వెంటనే ఆశీష్ ముందున్న టీపాయ్‌పై
> గ్లాజు గ్లాసులో వున్న ద్రవం రంగు
> ఎర్రగా మారింది.

'అదేంటి ఆశీష్. అప్పుడే వెళ్లిపోతున్నావు' అని ఆ వ్యక్తి లేచి ఆశీష్ చేతిని గట్టిగా పట్టుకొన్నాడు. ''వదలండి, నేను వెళ్లాలి'' అని గింజుకున్నాడు ఆశీష్.

హఠాత్తుగా దీపాలు వెలిగాయి. కరెంటు వచ్చినట్లుంది. గట్టిగా చప్పట్లు వినబడడంతో ఆశ్చర్యంతో చుట్టూ చూశాడు ఆశీష్.

టీపాయ్‌పై ప్లేటులో పెద్ద కేకు. దానిపై బాకు, కొవ్వొత్తులు. ప్లేటు ముందు పదేళ్ల కుర్రవాడు కొత్త బట్టల్లో వున్నాడు. చుట్టూ దాదాపు ఇరవై మంది పిల్లలు, బహుశా వాడి క్లాస్‌మేట్స్‌మో. వారిలో ఆశీష్ కొడుకు చింటూ కూడా వున్నాడు. పిల్లలంతా నవ్వుతూ వున్నారు. పిల్లిగడ్డం వ్యక్తి ఆశీష్ భుజం తట్టి చిరునవ్వుతో చెప్పాడు.

''ఈ రోజు మా అబ్బాయి సర్కార్ బర్త్‌డే. అందుకే అతని ఫ్రెండ్స్‌ను పార్టీకి ఇన్వైట్ చేశాం. మీరింత వరకు ఎప్పుడూ భయపడలేదని మీ అబ్బాయి మా వాడితో నాలుగు రోజులు ముందు చెప్పారట. మీ వాడు, మా అబ్బాయి సరదాగా పందెం కాచుకున్నారు. ఈ విషయంలో. కానీ పందెంలో మీరు గెలిచినట్లే''.

''లేదు, లేదు, నేను ఓడిపోయాను'' ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకొని ఆశీష్ అన్నాడు తడబడుతూ. 'ఇంతకూ ఆ యాభై వేల విషయం...' పిల్లల పందెంలో ఓడినా ఫర్వాలేదు. బ్యాంకు డబ్బు దక్కితే చాలు' అనుకుంటూ అన్నాడు ఆశీష్.

''ఇదిగోండి, పొద్దున మీరు పొరబాటున నాకు ఎక్కువగా ఇచ్చిన యాభైవేలు. రేపు బ్యాంకులో కట్టేయండి' అని ఆ వ్యక్తి జేబులోంచి ఓ నోట్ల కట్ట తీసి ఆశీష్ చేతిలో పెట్టాడు. ఆశీష్ ఆనందానికి అంతు లేకుండా పోయింది.

'ఇలా ఎప్పుడూ జరగలేదు. ఈ రోజెందుకిలా జరిగిందో అర్థం కావడం లేదు' అని గొణిగాడు సన్నగా.

'అది మీ తప్పుకాదు..' అని చిన్నగా నవ్వి చెప్పాడు పిల్లి గడ్డం వ్యక్తి. ఆశీష్ అర్థం కానట్లు చూశాడు.

'వృత్తిరీత్యా నేను మెజీషియన్ని. అందునా మెస్మరిజమ్ అంటే కనుకట్టు విద్యలో స్పెషలిస్టుని. ఇందాక మీరు మా ఇంట్లో చూసిన వింతలన్నీ అలాంటి విద్య వల్ల సాధ్యపడినవే. మా ఆవిడ కూడా మేజిక్ షోస్‌లో నాకు సహకరిస్తూ వుంటుంది' ఆ సరికి నీటుగా తయారై వచ్చిన తెల్ల చీరలోని మహిళను చూపిస్తూ అన్నాడతను.

ఆమె ఆశీష్‌కు నమస్కరించి 'ఇందాక మీకు కలిగించిన అసౌకర్యానికి సారీ అండీ... ఏదో పిల్లలు సరదా పడ్డారని ఇలా చేయవద్దని మా వారికి చెప్తూనే వున్నాను' అంది అపాలజిటిక్‌గా.

''మరేం ఫర్లేదు. కానీ బ్యాంకులో నా మీద కూడా మీ మెస్మరిజమ్ పని చేసినట్లుంది'' నవ్వుతూ భూపతి అనే ఆ పిల్లిగడ్డం మెజీషియన్‌తో అన్నాడు ఆశీష్.

''ఔను. ఇటీవల టెలీపతి విద్య, మెస్మరిజమ్ కలిపి ప్రాక్టీస్ చేస్తున్నాను. ప్రఖ్యాత ఇంద్ర జాలికుడు పిసి సిర్కార్ తాజ్‌మహల్‌ను మాయం చేయడం, ఏకంగా ఓ ట్రైన్‌నే వేనిష్ చేయడం గురించి మీరు విని వుంటారు. ఇదీ అలాంటి కనికట్టు విద్యే. మీ బ్యాంకులో పనిచేసే నా క్లోజ్ ఫ్రెండ్ గోపాల్‌తో ఓసారి ఈ టాపిక్ మాట్లాడుతూ ఈ ఐటమ్ ద్వారా మీ బ్యాంకులో కూడా ఎవరినైనా మెస్మరైజ్ చేసి మోసం చేయవచ్చని చెప్పాను. సరదాగా నా మాటలు నమ్మని గోపాల్ థౌజండ్ రూపీస్‌తో నాతోపందెం కాశాడు. బేంకులో ఇంతవరకు పొరబాటు చేయని మిమ్మల్ని నా కనికట్టుతో భ్రాంతిలోకి ముంచితే నేను గెలిచినట్లు ఒప్పుకుంటానన్నాడు. తాను రిస్క్ కవర్ చేస్తానని, ఓ గంట తరువాత జరిగింది చెప్పి మీ డబ్బు తానే తిరిగిచ్చేస్తానని అన్నాడు. కానీ ఈ రోజెందుకో బ్యాంకులో గోపాల్ లేడు. దానితో నేను కంగారు పడి ఇంటికి వచ్చేశాను. అదీగాక పిల్లల గేమ్‌లో భాగంగా విమ్మల్ని మా ఇంటికి రప్పించి భయపెట్టి చూపాలనుకున్నాం. మీకు చాలా ఇబ్బంది కలిగించాం. సారీ!'' అన్నాడు. పిల్లిగడ్డం భూపతి, ఆశీష్ చేతులు పట్టుకుంటూ.

ఆశీష్ తన మనసులోనే భూపతిని, గోపాల్‌ను బాగా తిట్టుకొని, 'అర్జెంటుగా గోపాల్ వుదయమే వూరెళ్లాడు. త్వరగా పార్టీ ముగిస్తే నేనింటికి వెళ్లాలి, మా అబ్బాయితో బాటు' అన్నాడు.

'అలాగే చేద్దాం' అని సర్కార్ చేతిలో బాకు వుంచి 'అబ్రకదబ్ర' అంటూ ఓసారి కేకుపై ఓ క్లాత్ వుంచి తీశాడు భూపతి. తెల్లటి కేకు చాక్లెట్ కలర్‌లోకి మారింది. పిల్లలు ఆనందంగా చప్పట్లు చరిచారు. పావు గంటలో బర్త్‌డే పార్టీ ముగిసింది.

*

చిరునామా:
రాచపూటి రమేష్,
1-0-73, రాయల్‌నగర్,
ఆర్‌సి రోడ్, తిరుపతి - 517 501